

# కల్యాణ్‌రామ్ మోడరన్ అవతార్

నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. విజయశాంతి ఇందులో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ సినిమా ప్రీ టీజర్‌ని ఈ నెల 14న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం కల్యాణ్‌రామ్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఫ్రెంచ్ గడ్డం, షేడ్స్‌తో, భారీ మైనింగ్ ల్యాండ్ స్కేప్‌లో డైనమిక్‌గా నడుస్తూ మోడరన్ అవతార్‌లో ఉన్న కల్యాణ్‌రామ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ప్రీ టీజర్‌లోనే అఫీషియల్ టీజర్ విడుదల తేదీని కూడా రివీల్ చేయనున్నామని మేకర్స్ తెలిపారు. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే: శ్రీకాంత్ విస్సా, కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.

# తొలిసారి డ్యూయల్ రోల్?



'పుష్ప-2' వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత అల్లు అర్జున్ చేయబోయే తదుపరి సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికైతే త్రివిక్రమ్, అట్లీ సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో కూడా ఓ ప్రాజెక్ట్ అనుకుంటున్నారు. వీటిలో అట్లీ సినిమా తొలుత పట్టాలెక్కే అవకాశముందని ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే బన్నీ టీమ్ నుంచి అధికారిక ప్రకటన వస్తేనే కానీ ఈ విషయంలో స్పష్టత రాదంటున్నారు. ఇదిలా వుండగా అట్లీ-అల్లు అర్జున్ సినిమాపై ఓ ఆసక్తికరమైన వార్త సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఇందులో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపిస్తారట. ఇదేగనుక నిజమైతే కెరీర్‌లో ఆయనకిది తొలి ద్విపాత్రాభినయం అవుతుంది. కమర్షియల్ చిత్రాలను తనదైన శైలిలో భారీ హంగులతో తెరకెక్కించడం దర్శకుడు అట్లీ శైలి. ఇక 'పుష్ప' సిరీస్ చిత్రాలతో తన మాస్ ప్రజెన్స్ ఎలా ఉంటుందో నిరూపించారు బన్నీ. మరి వీరిద్దరి కలయికలో సినిమా అంటే ఇక అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో చెప్పక్కర్లేదని అభిమానులు అనుకుంటున్నారు.



# 'లక్ష్మి' కాంబినేషన్ కుదిరిందా?

2006లో వెంకటేశ్, వి.వి.వినాయక్ కాంబినేషన్‌లో వచ్చిన 'లక్ష్మి' సినిమా ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. మళ్లీ 19ఏండ్ల తర్వాత ఈ కాంబినేషన్ రిపీట్ అవుతునట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. 'సంక్రాంతి వస్తున్నాం' అంటూ రీజనల్ సినిమా రికార్డులన్నింటినీ బద్దలు చేసేశారు వెంకటేశ్. ప్రస్తుతం ఆయనతో సినిమా చేసేందుకు నిర్మాతలందరూ ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలే వెంకటేశ్‌తో నిర్మాత నల్లమలుపు శ్రీనివాస్(బుజ్జి) సినిమాను ఓకే చేసుకున్నారని తెలుస్తున్నది. ఆ సినిమాకే వి.వి.వినాయక్ దర్శకత్వం వహిస్తారట. ఈ సారి కూడా 'లక్ష్మి' స్థాయి మాస్ కథనే వెంకీకి వినాయక్ వినిపించినట్టు సమాచారం. నిజానికి వి.వి.వినాయక్ సినిమా చేసి చాలా కాలమైంది. హిందీ 'ఛత్రపతి' తర్వాత ఆయన మళ్లీ మెగా ఫోన్ పట్టలేదు. మళ్లీ వెంకీ సినిమాతో ఆయన దర్శకుడిగా తన ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నట్టు బలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.



# ఇది చాలా సెన్సిటివ్ ఇష్యూ

పైకి కనిపించేంత అందంగా సినిమా తారల జీవితాలుండవు అనేది దగ్గరగా చూసిన వారికే తెలుస్తుంది. ఒక్కసారి సినిమాకు సైన్ చేశాక.. పారితోషికం అందుకున్నాక.. ఇక ఆ సినిమాకోసం ఎంతైనా కష్టపడాల్సిందే. పాత్రలో ప్రాణం పోసేందుకు ఎంతకైనా తెగించాల్సిందే. అందులో హీరోయిన్లేం మినహాయింపు కాదు. గర్భం దాల్చి కూడా యాక్షన్ సన్నివేశాల్లో నటించిన కథానాయికలు ఉన్నారు. అందుకు ఉదాహరణే దీపికా పదుకొణ్, అలియా భట్. నిండు గర్భంతో సినిమా ప్రమోషన్స్‌కు కూడా వారు హాజరైన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారినే అనుసరిస్తున్నది మరో బాలీవుడ్ భామ కియారా అద్వానీ. ప్రస్తుతం కైరా గర్భవతి. కానీ విశ్రాంతి తీసుకునే పరిస్థితి లేదు. ఆమె చేతిలో రెండు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి 'వార్ 2' కాగా, రెండోది కన్నడ సినిమా 'టాక్సిక్'. రెండూ భారీ మాస్ సినిమాలే. రెండింటిలో ఆమె యాక్షన్ సీన్స్‌లో నటించాల్సివుంది. ఈ రెండు సినిమాల్లోని తన పార్ట్‌ని పూర్తి చేయాల్సిన బాధ్యత కూడా ప్రస్తుతం ఆమెపై ఉంది. అందుకే.. గర్భం దాల్చి కూడా షూటింగుల్లో పాల్గొంటున్నది కియారా. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ 'ఇది చాలా సెన్సిటీవ్ ఇష్యూ. కానీ తప్పదు. నా ఒక్కదాని కోసం సినిమా ఆగదు కదా. ఇది కోట్లతో ముడిపడ్డ విషయం. అందుకే షూటింగ్ చేస్తున్నా. కానీ నా నిర్మాతలు నన్ను పసిపాపలా చూసుకుంటున్నారు. యాక్షన్ సీన్స్‌లో కూడా నాకు ఇబ్బంది లేకుండా ప్లాన్ చేస్తున్నారు. సెట్‌లో ఓ డాక్టర్.. ఓ ఆంబులెన్స్.. ఎమర్జెన్సీ చికిత్సకు అవసరమైన సరంజామా.. ఇవన్నీ నాకోసం ఏర్పాటు చేశారు. అందుకే భయం లేకుండా షూటింగ్‌లో పాల్గొంటున్నా. ఈ విషయంలో నా నిర్మాతలకు థ్యాంక్స్ చెప్పకుండా ఉండలేకపోతున్నా..' అంటూ ఆనందం వెలిబుచ్చారు కియారా అద్వానీ.

# 'దిల్‌రూబా'లో కొత్త కిరణ్‌ని చూస్తారు



' 'దిల్‌రూబా' విషయంలో చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా. నెల 14 కాదు, 13 సాయంత్రమే ప్రీమియర్స్ వేస్తున్నాం. అంటే ఒకరోజు ముందుగానే 'దిల్ రూబా' సక్సెస్ జర్నీ మొదలుకానుంది. 2గంటల 20 నిమిషాలు సినిమా ఎక్కడా బోర్ కొట్టదు. 'క'లో కంటెంట్‌ని చూశారు. 'దిల్ రూబా'లో కిరణ్ అబ్బవరంను చూస్తారు. విశ్వకరుణ్ నన్ను చూపించిన విధానం మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఉమెన్‌పై రెస్పెక్ట్‌తో ఈ సినిమా చేశాం. ఈ న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా ఎంత పెద్ద సక్సెస్ అనేది ఇప్పుడే చెప్పలేని కానీ, సమయాన్ని మాత్రం వృథా చేయదు' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్‌రెడ్డి, సారెగమ నిర్మించిన చిత్రం 'దిల్ రూబా'. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడారు. అందరూ ప్యాషన్‌తో వర్క్ చేయడం వల్లే ఇంత మంచి అవుట్‌పుట్ వచ్చిందని, ఇందులోని కిరణ్ డైలాగులు, ఫైట్స్ మిమ్మల్ని ఆకట్టుకుంటాయని, ఇందులో కొత్త కిరణ్ అబ్బవరంని చూస్తారని దర్శకుడు విశ్వకరుణ్ తెలిపారు. ఇంకా హీరోయిన్లు రుక్సర్ థిల్లాన్, క్యాతీ డేవిసన్, నిర్మాతలు రవి, రాకేశ్‌రెడ్డి, డీవోపీ డేనియల్ విశ్వాస్‌తోపాటు చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

# ఏప్రిల్‌లో గద్దర్ అవార్డులు



'గద్దర్ అవార్డులకు సంబంధించిన విధివిధానాలు ఖరారయ్యాయి. బి.నరసింగరావు అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశాం. గతంలో నంది అవార్డుల స్థానే ఇక నుంచి గద్దర్ అవార్డులు కొనసాగుతాయి' అని టీఎఫ్‌డీసీ ఛైర్మన్, అగ్ర నిర్మాత దిల్ రాజు పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రదానం చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ '2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ వరకూ విడుదలైన చిత్రాల్లో ప్రతి ఏడాదీ ఓ ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. 2024కు సంబంధించి కొన్ని మార్పులు చేర్పులు ఉంటాయి. వివిధ కేటగిరీలో అవార్డులను అందిస్తాం. గత నంది అవార్డులకు సంబంధించిన విధి విధానాలే దాదాపుగా కొనసాగుతాయి. తెలంగాణకు వన్నె తెచ్చిన ప్రఖ్యాత నటులు పైడి జైరాజ్, కాంతారావుల పేరిట గౌరవ పురస్కారాలు అందించను న్నాం. తెలుగుతోపాటు ఉర్దూ సినిమాలను కూడా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉర్దూ సినిమాకు కూడా అవార్డులు ఇవ్వనున్నాం' అని తెలిపారు దిల్‌రాజు. ఓ వారం రోజుల్లో గద్దర్ అవార్డులకు సం బంధించిన జ్యూరీని ఏర్పాటు చేయనున్నామని, ఈ అవార్డుల విధివిధానాలకు సంబంధించిన పూర్తి వివరాలు జ్యూరీ తెలియజేస్తుందని, ఏప్రిల్‌లో గద్దర్ అవార్డుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని దిల్‌రాజు పేర్కొన్నారు. ప్రముఖ దర్శకుడు బి.నరసింగరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గద్దర్ అవార్డు కమిటీలో దిల్‌రాజు ఉపాధ్యక్షుడిగా, కె.రాఘవేంద్రరావు, అందెశ్రీ, తమ్మా రెడ్డి భరద్వాజ్, అల్లు అరవింద్, గుమ్మడి వెన్నెల, తనికెళ్ల భరణి, డి.సురేశ్‌బాబు, చంద్రబోస్, ఆర్.నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్, అల్లాణిశ్రీధర్, సానా యాదిరెడ్డి, హరీశ్‌శంకర్, వేణు యల్దండి సలహాదారులుగా ఉన్నారు.

### అవార్డులను వివాదం చేయొద్దు

'గద్దర్' అవార్డులను కొందరు సినిమావాళ్లు వ్యతిరేకిస్తున్నారని తెలిసింది.. వారికి మీరిచ్చే సమాధానమేంటి?' అని ఓ విలేకరి అడగ్గా.. 'అది అవాస్తవం. ఎవరూ వ్యతిరేకించడంలేదు. ప్రభుత్వం అందించే అవార్డులను స్వీకరించడం సినిమావాళ్లందరం గౌరవంగా భావిస్తాం. అనవసరంగా సినిమా అవార్డుల విషయాన్ని వివాదం చేయొద్దు' అని దిల్ రాజు కోరారు.



# పోక్సో చట్టాన్ని స్టడీ చేశాను

' ఈ కథ పోక్సో యాక్ట్ నేపథ్యంలో ఉంటుంది. ఈ యాక్ట్‌ని అధ్యయనం చేసి ఈ కథ రాశాను. రియల్‌లైఫ్ ఇన్సిడెంట్స్‌ని స్ఫూర్తిగా తీసుకుని తయారు చేసుకున్న ఫిక్షనల్ కథ ఇది.' అని దర్శకుడు రామ్ జగదీష్ అన్నారు. ఆయన దర్శకత్వంలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన చిత్రం 'కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. హీరో నాని సమర్పణలో వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై రూపొందిన ఈ సినిమాలో ప్రియదర్శి ప్రధాన పాత్రధారి. ఈ నెల 14న, అంటే.. రేపు సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌జగదీష్ బుధవారం విలేకరులతో ముచ్చటించారు. 'ఫోక్సో యాక్ట్ అధ్యయనం చేసే క్రమంలో కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగాను. ఎందరో లాయర్లతో, పోలీసులతో ఇంటరాక్ట్ అయ్యాను. నిజానికి ఫోక్సో చట్టం గురించి బయట ప్రపంచానికి చాలా తక్కువ తెలుసు. దాని గురించి ఈ సినిమాలో డీటెయిల్‌గా చెప్పాం.' అని తెలిపారు రామ్ జగదీష్. 'నాని గారికి ఈ కథ చెప్పడానికి ఎనిమిది నెలలు ఎదురు చూశాను. ఫైనల్‌గా కథ చెప్పాను. ఆయన కథ వినే తీరు చూసి నాకు చాలా ఆనందంగా అనిపించింది. దాదాపు రెండున్నర గంటల కథని సింగిల్ సిట్టింగ్‌లో విన్నారాయన. కథ మొత్తం విని నిల్చుని షేక్ హ్యాండ్ ఇచ్చి 'వెల్కమ్ టు వాల్‌పోస్టర్ సినిమా' అన్నారు. అది నా జీవితంలో హై మూమెంట్.' అని ఆనందం వెలిబుచ్చారు. ఇందులో ప్రతి పాత్రనూ ఆడిషన్ చేసే తీసుకున్నామని, ప్రియదర్శి పాత్ర అద్భుతంగా ఉంటుందని, శివాజీ ఇందులో మంగపతిగా కనిపిస్తారని, ప్రతి కుటుంబంలో అలాంటి క్యారెక్టర్ ఉంటుందని, ఇందులో యంగ్‌పెయిర్ రోషన్, శ్రీదేవి పాత్రలకు ప్రాణం పోశారని, సాంకేతికంగా అన్ని విధాలా సినిమా బావుంటుందని, అందరి జీవితం ఈ సినిమా, అందరూ తెలుసుకోవాల్సిన నిజం ఈ సినిమా అని రామ్ జగదీష్ చెప్పారు.

# మాటల మర్మం ఏమిటో?

అచ్చ తెలుగందం శ్రీలీల బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తూ కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా దీపావళికి విడుదల కానుంది. అయితే అరంగేట్రం చిత్రంతోనే ఈ భామ బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. కార్తీక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నది. ఇటీవల కార్తీక్ ఆర్యన్ ఫ్యామిలీ పార్టీలో శ్రీలీల పాల్గొనడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. తాజాగా 'ఐఫా' వేడుకల్లో కార్తీక్ ఆర్యన్ తల్లి చేసిన వ్యాఖ్యలు డేటింగ్ వార్తలు నిజమనే భావన కలిగించేలా ఉన్నాయి. 'ఐఫా' వేడుకలో పాల్గొన్న ఆమెను నిర్మాత కరణ్‌జోహార్ 'మీకు కాబోయే కోడలు ఎలా ఉండాలనుంటున్నారు' అని ప్రశ్నించారు. ఓ మంచి డాక్టర్ మా ఇంటి కోడలిగా రావాలన్నది మా అందరి అభిమతం అంటూ కార్తీర్ ఆర్యన్ తల్లి సమాధానమిచ్చింది. శ్రీలీల మెడిసిన్ చదివిన విషయం తెలిసిందే. దీంతో ఆమెను ఉద్దేశించే కార్తీక్ ఆర్యన్ తల్లి ఆ వ్యాఖ్యలు చేసిందని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. ఆ మాటల వెనక మర్మమేమిటో తెలియాలంటే తారలిద్దరిలో ఎవరో ఎవరో స్పందించాల్సిందేనని అభిమానులు అనుకుంటున్నారు.



# నయనతారపై కోటి రూపాయల దావా



'నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్' డాక్యుమెంటరీ విషయంలో అగ్ర తారలు ధనుష్, నయనతార మధ్య తలెత్తిన కాపీరైట్ వివాదం ఇప్పట్లో సమసిపోయేలా లేదు. భర్త విఘ్నేష్‌శివన్‌తో కలిసి నయనతార ఈ కేసును ఎదుర్కొంటున్నది. ఆ డాక్యుమెంటరీలో తాను నిర్మించిన 'నానుమ్ రౌడీదాన్' సినిమా తాలూకు బిహైండ్ ది సీన్స్ విజువల్స్‌ను వాడుకున్నారని ధనుష్ కొద్ది మాసాల క్రితం చెన్నై కోర్టులో కేసు వేసిన విషయం తెలిసిందే. నవంబర్‌లో ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. ఆ సమయంలో డాక్యుమెంటరీ స్ట్రీమింగ్‌ను నిలిపివేయాలని ధనుష్ చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. తాజాగా ఈ కేసు వచ్చే నెలలో హియరింగ్‌కు రానుంది. ఈ నేపథ్యంలో ధనుష్ తరపు న్యాయవాదులు తాజా అఫిడవిట్‌ను దాఖలు చేశారు. 'నానుమ్ రౌడీదాన్' షూటింగ్ సమయంలో దర్శకుడు విఘ్నేష్‌శివన్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించాడని, కథానాయిక నయనతారకు సంబంధించిన సన్నివేశాల విషయంలో ఎన్నోసార్లు రీటేక్‌ను తీసుకున్నారని, దానివల్ల ఇతర నటీనటులు ఇబ్బందిపడ్డారని, ప్రొడక్షన్‌కు కూడా నష్టం జరిగిందని, అందుకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లో కోర్టు వెలువరించే తీర్పు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.



# తను జతగా లేని కథలో..

విజయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రధారులుగా రూపొందిన పొయెటిక్ ప్రేమకథ 'కాలమేగా కరిగింది.'. సింగార మోహన్ దర్శకుడు. మరే శివశంకర్ నిర్మాత. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని పాటను బుధవారం మేకర్స్ విడుదల చేశారు. 'తను జతగా లేని కథలో.. ఈ ఒంటరి పరుగెక్కడికో.. తను నేరుగా తాకే సడిలో.. ఈ తుంటరి స్మృతిలెక్కడివో..' అంటూ సాగే ఈ పాటను శరత్‌చంద్ర తిరునగరి రాయగా, గుడప్పన్ స్వరపరిచారు. కృష్ణ తేజస్వి ఆలపించారు. యువతరం మెచ్చే ప్రేమకథ ఇదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: వినీత్ పబ్బతి, నిర్మాణం: సింగార క్రియేషన్స్ వర్క్స్.

# పార్కింగ్ కోసం 30కోట్లు

నాటి యువతరం కలలరాణి కాజోల్ ఇప్పుడు బీ టౌన్‌లో చర్చనీయాంశంగా నిలిచారు. తన అయిదు కార్ల పార్కింగ్ కోసం 30కోట్లతో ఆమె ఓ స్థలాన్ని కొనుగోలు చేయటమే ఈ చర్చకు ప్రధాన కారణం. బాలీవుడ్ కథనాల ప్రకారం భారత్ రియాలిటీ వెంచర్స్ అనే రియల్ ఎస్టేట్ కంపెనీ నుంచి 4వేల 365 గజాల రిటైల్ స్థలాన్ని, గజానికి 65వేల 940 రూపాయలు చెల్లించి కాజోల్ కొనుగోలు చేశారట. అది కూడా కేవలం తన అయిదు కార్ల పార్కింగ్ కోసం. ఈ వార్త సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. సినీ వర్గాల్లో అయితే.. చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కాజోల్ పలు వెబ్ సిరీస్‌లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఆమె నటించిన 'మా' అనే సినిమా జూన్ 7న విడుదల కానుంది.





# హత్య చేసిందెవరు?

రుషి కిరణ్, శ్వేత, రూప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది సస్పెక్ట్'. రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కిరణ్ కుమార్ నిర్మించారు. ఈ నెల 21న విడుదలకానుంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశమిదని, ఓ అమ్మాయి హత్యకు కారకులైన వారిని పట్టుకునే క్రమంలో జరిగే సంఘటనలు ఉత్కంఠను పంచుతాయని దర్శకుడు తెలిపారు. అంతా కొత్తవాళ్లైనా మంచి నటనను కనబరిచారని నిర్మాత కిరణ్ కుమార్ పేర్కొన్నారు. శివ యాదవ్, రజిత, మృణాల్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రాఘవేంద్ర, సంగీతం: ప్రజ్వల్ క్రిష్, రచన-దర్శకత్వం: రాధాకృష్ణ.

